
RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 20 -12 - 2023 | సంపుటి: 1 | సంచిక : 215 | పేజీలు : 4 | వెల : 5/-

## ప్రభువా.. నిబంధనలకు సిలువ !



- చర్చీ ముసుగులో అక్రమంగా నిర్మాణం
- ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ షెడ్
- 12 అడుగుల లోతు సెల్లార్ తవ్వకాలు
- స్థానిక నేతల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు
- లక్షల్లో ముడుపులు ముట్టినట్లు ప్రచారం



# పెట్టుబడికి కట్టుబాట్లు

- రైతుబంధులో మార్పులకు అవకాశం
- రేవంత్ సర్కారు తాజా నిర్ణయం
- పదెకరాల వరకే ఆర్థిక సాయం?
- అయినా ప్రభుత్వంపై తప్పని భారం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ కొత్త ప్రభుత్వం రైతుబంధు(రైతు భరోసా) పథకంలో మార్పులకు నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. పెట్టుబడి సాయానికి పరిమితులు విధించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఎవరికి పథకం వర్తింపచేయాలనే దాని పైన మార్గదర్శకాలు సిద్ధం అవుతున్నాయి. 5 ఎకరాల్లోపు ఉన్న వారు రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం మంది రైతులు ఉన్నారు. ఎకరాలోపు రైతులు 22.55 లక్షల మంది ఉన్నట్లు తేల్చారు. దీంతో..ప్రభుత్వ నిర్ణయం సంచలనంగా మారుతోంది. ప్రభుత్వం రైతుబంధు పథకం పునఃసమీక్షిస్తోంది. ఈ యాసంగి సీజన్ వరకూ గతంలో మాదిరిగానే ఎలాంటి పరిమితులూ లేకుండా రైతుబంధు పంపిణీ చేసి.. వచ్చే వానాకాలం(ఖరీఫ్) సీజన్ నుంచి 10 ఎకరాల పరిమితితో రైతుభరోసా పేరిట నగదు పంపిణీ చేసేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు సమాచారం. పదికి మించి ఎన్ని ఎకరాలు ఉన్నా.. పది ఎకరాలకు మాత్రమే రైతుభరోసా ఇవ్వనున్నట్లు సమాచారం.అంటే ఒక రైతుకు 15 ఎకరాలుంటే.. 10 ఎకరాలకే రైతు భరోసా వస్తుంది. మిగతా

మిగతా 2వ పేజీలో...

# రామన్న వర్సెస్ రామయ్య

### కర్ణాటక సీఎం, కేటీఆర్ మధ్య ట్వీట్‌వార్

- హామీలపై సిద్ధరామయ్య వీడియో వైరల్
- తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్
- సోషల్ మీడియాలో టగ్ ఆఫ్ వార్



**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :** కాంగ్రెస్ ఇచ్చిన అన్నీ గ్యారెంటీలు అమలు సాధ్యం కాదని కర్నాటక అసెంబ్లీ ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య అన్నట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. సిద్ధరామయ్య మాట్లాడిన ఆ వీడియోను ట్విట్టర్‌లో పోస్టు చేసి... తెలంగాణ భవిష్యత్ కూడా ఇంతేనా అంటూ ప్రశ్నించారు బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో...






# ఉద్యోగమా? సద్యోగమా?

- నిరుద్యోగ భృతిపై కండిషన్స్ అప్లై
- అమలుపై సర్కారు తర్జనభర్జన
- త్వరలో మార్గదర్శకాలు

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :** తెలంగాణలో ప్రభుత్వం మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల వేళ తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఉద్యోగ ప్రకటన ఇచ్చేంత వరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు రేవంత్ రెడ్డి. ఈ మేరకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా పేర్కొన్నారు. ఇప్పుడు సీఎంగా రేవంత్ రెడ్డే అవడంతో.. యావత్ తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ యువత ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఉద్యోగ ప్రకటన విడుదల చేస్తారా? నిరుద్యోగ భృతి ఇస్తారా? అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యోగ ప్రకటన ఇచ్చేంత వరకు నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని పేర్కొంది. దీంతో నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన విడుదల చేస్తుంది? ఎప్పుడు విడుదల చేస్తుంది? అర్హతలేంటి? అని ఎదురు చూస్తున్నారు నిరుద్యోగులు. అయితే, ప్రభుత్వం సైతం నిరుద్యోగ భృతి చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం అందుతోంది. నిరుద్యోగ భృతి కోసం నియమ నిబంధనలు కూడా రూపొందించే పనిలో నిమగ్నై ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నిరుద్యోగ భృతి పొందాలంటే సదరు వ్యక్తి కొన్ని అర్హతలు కలిగి ఉండాల్సి ఉంటుంది. ఆ అర్హతలు ఉన్న వారికే ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించనుంది. కాగా, నిరుద్యోగ భృతి అంశాన్ని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అసెంబ్లీలో ప్రధానంశంగా ప్రస్తావించారు. టీఎస్‌పీఎస్సీలో దాదాపు 42 లక్షల మంది నిరుద్యోగులుగా రిజిస్టర్ చేసుకున్నారు. వీరందరికీ నెలకు రూ. 4 వేలు చొప్పున

**అర్హతలివే..?**
- నిరుద్యోగి తెలంగాణలో పుట్టిన వారై ఉండాలి
- దరఖాస్తు చేసే టైంలో నిరుద్యోగై ఉండాలి
- గ్రాడ్యుయేషన్, డిప్లొమా పూర్తి చేసి నిరుద్యోగిగా ఉండాలి
- జిల్లాలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో నమోదై ఉండాలి

మిగతా 2వ పేజీలో...



## నేడు భూదాన్ పోచంపల్లికి రాష్ట్రపతి

- వస్త్రాల తయారీని పరిశీలించనున్న ముర్ము
- నేత కార్మికులతో ప్రత్యేక సమావేశం

**యాదాద్రి భువనగిరి, ప్రభాతసూర్యుడు :** బుధవారం భూదాన్ పోచంపల్లిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటించనున్నారు. భూదాన్ పోచంపల్లి పట్టణానికి రాష్ట్రపతి రాక సందర్భంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. హెలీప్యాడ్ వద్ద డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బలగాలు సభా ప్రాంగణాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. రాష్ట్రపతి రాక సందర్భంగా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్రపతి పర్యటించే ప్రదేశాలను అన్ని శాఖల అధికారులు సందర్శించి పరిశీలించారు ఉదయం 11.10 నుంచి

మిగతా 2వ పేజీలో...

# ముచ్చటగా మూడోసారి..

- నేటి నుంచి అసెంబ్లీ సెషన్
- ఆరు గ్యారంటీల బిల్లుకు మోక్షం
- సభ సజావుగా సాగేనా?





**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాజకీయం హీటెక్కుతోంది.. ముమ్ముందు రాజకీయాలు ఏ రకంగా ఉండబోతున్నాయనే.. అంశంపై అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతూనే దాదాపుగా ఓ క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా తొలి సమావేశాలు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయిలో జరిగిన సందర్భాలు చాలా తక్కువగా ఉంటాయి. కానీ తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నంగా తొలి సమావేశాలే హాట్ హాట్‌గా సాగాయి. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తగ్గేదేలే అన్నట్టుగా వ్యవహరించాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వెలికి తీస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటుంటే.. దేనికైనా రెడీ అని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తేల్చిచెప్పింది. గతాన్ని గుర్తు చేస్తూ గులాబీ పార్టీని కట్టడి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తుంటే.. ఆ గతాన్నే తమ బలంగా మార్చుకోవా లని డిసైడ్ అయ్యింది కేసీఆర్ టీమ్. తొలి సమావేశాల్లోనే

మిగతా 2వ పేజీలో...

## పేదలకు పండుగే..

- రేషన్‌కార్డుల జారీకి సర్కారు గ్రీన్‌సిగ్నల్
- ఈ నెల 28 నుంచి దరఖాస్తులకు మోక్షం
- సీఎం రేవంత్ సరికొత్త నిర్ణయం




## చిన్న డాక్టర్లతో సంధి

- జూనియర్ డాక్టర్లతో మంత్రి దామోదర భేటీ
- వైద్యబృందంతో ప్రభుత్వ చర్చలు సఫలం
- ప్రతి నెలా 15కల్లా స్టైఫండ్ చెల్లింపునకు హామీ





# న్యూఇయర్ వేడుకలపై నిఘా


- మత్తు పదార్థాలపై పోలీసుల ఉక్కుపాదం
- విక్రయదారులు పలువురు అరెస్ట్
- నూతన సంవత్సర సంబరాలపై ఆంక్షలు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ మహానగరాన్ని డ్రగ్స్ మహమ్మారి వదిలేలా కనిపించడం లేదు. నగరంలో వేళ్లూనుకుపోయిన డ్రగ్ మాఫియా విచ్చలవిడిగా మత్తు పదార్థాలు సప్లై చేస్తోంది. ఇప్పుడు న్యూఇయర్ వేడుకలు దగ్గర పడటంతో భారీ మొత్తంలో డ్రగ్స్ డంప్ చేశారు. హైదరాబాద్‌లో కేవలం 24 గంటల్లోనే నాలుగు చోట్ల డ్రగ్స్ ముఠాను అరెస్ట్ చేశారు. ఎస్సార్ నగర్, ఫిలింనగర్, చైతన్య పురిలో డ్రగ్స్ ముఠాలు పోలీసులకు చిక్కారు. నగరంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ నిల్వ ఉన్నాయనే సమాచారంతో పెద్ద ఎత్తున తనిఖీలు చేస్తున్నారు అధికారులు. మూడు కమిషనరేట్ పరిధిలో పోలీసులు హైఅలర్ట్ విధించారు. స్నిఫర్ డాగ్స్‌తో పబ్బుల్లో తనిఖీలు చేపట్టారు. పాత నేరస్థులపై టినాబ్ నిఘా పెంచింది. ఇప్పటికే పాత నేరస్థులు పోలీసులకు పట్టుబడుతున్నారు. అంతేకాకుండా.. పబ్బులు, సినిమా ఇండస్ట్రీపై పూర్తి నిఘా పెట్టారు. డ్రగ్ డ్రాపర్

మిగతా 2వ పేజీలో...

# కొత్త రకం కరోనా

- కొవిడ్ మరో వేరియంట్ ప్రభావం
- హైదరాబాద్‌లో కేసులు నమోదు
- జాగ్రత్తగా ఉండాలన్న ప్రభుత్వం
- మాస్కు పెట్టుకోవాలన్న వైద్యశాఖ



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తప్పిపోయిందనుకున్న కరోనా ముప్పు.. రూపం మార్చుకుని మళ్లీ వచ్చేసింది. కరోనా కొత్త వేరియంట్ ఏఐ.1 విజృభిస్తోంది. రెండురోజులుగా కొత్త వేరియంట్ తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఏకంగా మళ్లీ కరోనా మరణాలను పరిచయం చేస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య మళ్ళీ పెరుగుతోంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కరోనా కొత్త వేరియంట్ బారిన పడి ఆరుగురు మృతి చెందారు. ఈ తాజా పరిణామాలు ప్రజలను మళ్ళీ భయ ప్రాంతులకు గురి చేస్తున్నాయి. కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై రాష్ట్రాలకు కీలక సూచనలు జారీ చేసింది.కరోనా కొత్త వేరియంట్ కేసులతో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కరోనా చికిత్సలకు నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ ఆస్పత్రి సిబ్బంది కూడా అప్రవ-ుత్తమై.. కొవిడ్ కేసుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎప్పుడు రోగులు వచ్చినా చికిత్సలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. సాధారణ రోగుల కోసం 30 పడకలు, గర్భిణుల కోసం మరో 20 ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మన వద్ద అలాంటి కేసులు బయటపడలేదని చెప్పారు.ఈ వేరియంట్‌లో జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. కేసులు పెరిగితే మళ్లీ టెస్టులు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. రాబోయే పండుగల సీజన్ల దృష్ట్యా ప్రజలంతా జాగ్రతగా ఉండాలని, మాస్కులను ధరించాలని ప్రజలను కోరుతున్నారు.ఇక, దేశంలో కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తోంది. కోవిడ్ కేసుల సంఖ్య మళ్ళీ పెరుగుతోంది.. దేశంలో ఇప్పటివరకు కరోనా కొత్త వేరియంట్ బారిన పడి ఆరుగురు మృతి చెందారు.. ఈ తాజా పరిణామాలు ప్రజలను మళ్ళీ భయ ప్రాంతులకు గురి చేస్తున్నాయి. కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# చిన్న డాక్టర్లతో కుదిరిన సంధి

- జూనియర్ డాక్టర్లతో మంత్రి దామోదర భేటీ
- వైద్యబృందంతో ప్రభుత్వ చర్చలు సఫలం
- ప్రతి నెలా 15కల్లా స్టైఫండ్ చెల్లింపునకు హామీ
- ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనంపైనా చర్చ
- త్వరలో నిర్మాణం చేపడతామని మంత్రి వెల్లడి
- సమ్మె నిర్ణయానికి బ్రేక్



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** చిన్న డాక్టర్లతో సంధి కుదిరింది. సమ్మె నిర్ణయానికి బ్రేక్ పడింది. తమ సమస్యలు పరిష్కరించుకునే నేపథ్యంలో జూనియర్ డాక్టర్లు ఈ నెల 19 నుంచి సమ్మె చేపడతామని నోటీసు ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం సమ్మెకు దిగనున్న వారిని ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జూనియర్ డాక్టర్ల ప్రతినిధులతో భేటీ అయ్యారు. వారి సమస్యలను సావధానంగా విన్న పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో సమ్మె నిర్ణయానికి బ్రేక్ పడింది.

**మంత్రికి సమస్యల విన్నపం**

మంత్రితో భేటీ అయిన జూనియర్ డాక్టర్లు తమ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా తమకు స్టైఫండ్ మూడు నెలలుగా నిలిచిపోయిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి.. వారికి ప్రతి నెలా 15వ తేదీకల్లా స్టైఫండ్ చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే జూనియర్ డాక్టర్ల విజ్ఞప్తి ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం కూడా త్వరలో చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. దీంతో జూనియర్ డాక్టర్లు తమ సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 8వేల మంది వివిధ విభాగాలకు చెందిన జూనియర్ డాక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా సమ్మెకు దిగితే వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. అదీగాక, కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతోందనే వార్తల నేపథ్యంలో వీరి సమ్మె ప్రజారోగ్యం తీవ్ర ప్రభావం చూపేదని పలువురు అభిప్రా-యపడ్డారు. మొత్తానికి చర్చలు సఫలం కావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# ఉద్యోగమా? సద్యోగమా?

మొదటిపేజీ తరువాయి..

నిరుద్యోగ భృతి చెల్లించాలంటే నెలకు రూ. 1200 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉంది. మొత్తంగా చూ-సుకుంటే.. నిరుద్యోగ భృతి కోసం దాదాపు రూ. 14 వేల కోట్లు అవ-సరం పడుతుంది.అయితే, ఈ హామీ విషయంలో చిన్న ట్విస్ట్ ఉంది. వాస్తవానికి కాంగ్రెస్ తన ఆరు గ్యారెంటీల్లో నిరుద్యోగ భృతిని చేర్చలేదు. ఈ ఆరు గ్యారెంటీలకు అదనంగా ప్రకటించిన మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతిని చేర్చింది కాంగ్రెస్. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రకటన విడుదలయ్యే వరకు డిసెంబర్ 9వ తేదీ నుంచే నెలకు రూ. 4 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేసా-మని పేర్కొంది. అంతేకాదు.. పలు సభల్లో కూడా రేవంత్ రెడ్డి సహా పార్టీ కీలక నేతలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. దాంతో ఇప్పుడు తెలంగాణలోని నిరుద్యోగులంతా ఈ భృతి కోసం ఎదురు చూస్తున్నారు.

# ప్రజావాణికి వినతుల వెల్లువ

**పరిష్కారానికి వేచి ఉండాలన్న మంత్రి పొన్నం**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ప్రజావాణికి ప్రజల తాకిడి పెరుగుతోంది. తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మంగళవారం కూడా వివిధ జిల్లాల నుంచి ప్రజాభవన్‌కు చేరుకున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వానికి వినతులు సమర్పించారు. ప్రజావాణిలో తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చిన వారితో ప్రజాభవన్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజావాణిలో ధరణి సమస్యలు, పెన్షన్, డబుల్ బెడ్ రూం సమస్యలపైనే ప్రజల నుంచి ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నాయి. గత ప్రభుత్వం తమ ఇబ్బందులను పట్టించుకోలేదని.. ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము అర్హులమైనా పెన్షన్, డబుల్ బెడ్ రూం ఇవ్వడం లేదని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. మంగళవారం ప్రజావాణిలో మొత్తం 5 వేలకు పైగా ప్రజల నుంచి వినతులు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అయితే ప్రభుత్వం పాలసీపరంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని.. వాటి ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. త్వ-రలోనే కీలక అంశాలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. అప్పటివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ప్రజలు వేచి ఉండాలని కోరారు.

# ముచ్చటగా మూడోసారి..

మొదటిపేజీ తరువాయి..




అధికార, విపక్షాల మధ్య పొలిటికల్ వార్ ఓ రేంజ్‌లో సాగిం ది. అయితే, వాయిదా పడిన అసెంబ్లీ సమావేశాలు మళ్లీ బుధ వారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ సర్కార్ శాఖలవారీగా శ్వేతపత్రాలు కూడా విడుదల చేస్తామని చెబుతుండటంతో బీఆర్ఎస్ కూడా సిద్ధమవుతోంది.ఈ క్రమంలో తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కు మాజీ మంత్రి హరీష్ రావు లేఖ రాయడం ప్రాధాన్యతను సంతరిం చుకుంది. కాంగ్రెస్ పార్టీ శాసనసభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తే.. భారత రాష్ట్ర సమితి పార్టీ కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయడానికి అనుమతి మంజూరు చేయాలంటూ హరీష్ రావు లేఖ రాశారు. హరీష్ రావు లేఖలో ఏం రాశారంటే.. "రేపటి నుంచి జరిగే శాసనసభ సమావేశాలలో ఆర్థిక, సాగునీటి, విద్యుత్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం ఉంది. ఒక వేళ ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు అనుమతించినట్లైతే, దీనికి సంబంధించి ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలకు సభ ద్వారా మా వెర్షన్ చెప్పవలసి ఉంటుంది. మేము కూడా సభలో ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కావున భారత రాష్ట్ర సమితి శాసనసభా పక్షానికి కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వగలరని మనవి." అంటూ హరీష్ రావు స్పీకర్‌కు లేఖలో వివరించారు.



# నేడు భూదాన్ పోచంపల్లికి రాష్ట్రపతి

మొదటిపేజీ తరువాయి..

మధ్యాహ్నం 12.10 వరకు రాష్ట్రపతి పర్యటన ఉంటుందన్నారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలో టూరిజం పార్కులో మొదటగా వినోబావే విగ్రహానికి పూలమాల వేసి, అక్కడనుండి పక్కనే ఉన్న వినోబా మందిరంలో ఫొటో ఎగ్జిబిషన్‌ని పరిశీలించనున్నారు, అనంతరం పోచంపల్లిలోని నేతన్నల ఇండ్లలోకి వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకుంటారు. అనంతరం శ్రీరంజన్ పరిశ్రమలో పట్టుపురుగుల నుంచి పట్టుదారాన్ని తీసి చీరల తయారీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఆ తర్వాత శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించి, పద్మశ్రీ సంత్ కబీర్, జాతీయ అవార్డు గ్రహీతలతో మాట్లాడనున్నారు. వీటితో పాటు చేనేత మగ్గాల ప్రదర్శన ఉంటుందని అధికారులు తెలిపారు.

# పెట్టుబడికి కట్టుబాట్లు

మొదటిపేజీ తరువాయి..

ఐదెకరాలకూ రాదు. అలాగే.. ఇప్పటిదాకా ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు పంపిణీ చేస్తుండగా.. వచ్చే సీజన్ నుంచి ఒక పంటకు ఎకరానికి రూ.7,500 చొప్పున? ఏడాదికి రూ.15 వేల చొప్పున పంపిణీ చేయనున్నట్టు తెలిసింది.

**పరిమితులు ? ప్రతిపాదనలు?**

రైతుభరోసా పథకానికి పరిమితులు విధించినా లబ్ధిదారుల సంఖ్య ఏమాత్రం తగ్గదు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది పట్టాదారులుండగా.. వీరందరికీ రైతుభరోసా అందుతుంది. రాష్ట్రంలో 10 ఎకరాల నుంచి 54 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 1.15 లక్షల మంది ఉన్నారు. వీరి పేరిట 12.50 లక్షల ఎకరాల భూమి ఉంది. అయితే పదెకరాల పరిమితి పెడితే? 1.15 లక్షల మందికి 11.50 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించాల్సి వస్తుంది.

**లక్ష ఎకరాలకు కట్..**

కటాఫ్ విధించటం ద్వారా కేవలం లక్ష ఎకరాలకు రైతు భరోసా ఆగిపోతుంది. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఏడాదికి రూ.150 కోట్లు తగ్గుతుంది. కానీ ఇప్పటి వరకూ ఉన్న పెట్టుబడి సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచటంతో.. 50 శాతం ఆర్థిక భారం పెరుగుతుంది.

**ఐదు కరాలకు అమలు..**

ఒక లక్ష ఎకరాలకు మినహాయించి.. 1.49 కోట్ల ఎకరాలకు రైతు భరోసా పంపిణీ చేయాలంటే? ఏడాదికి రూ.22,350 కోట్లు అవుతుంది. ఇప్పటివరకూ రైతుబంధు పథకానికి ఏడాదికి అవుతున్న ఖర్చు రూ.15 వేల కోట్లు. అంటే, ఇకపై రూ.7,350 కోట్ల మేర ఆర్థికభారం పెరిగే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# రామన్న వర్సెస్ రామయ్య

మొదటిపేజీ తరువాయి..

ఎమ్మెల్యే కేటీఆర్. హామీలు ఇచ్చే ముందు ఆలోచించరా అంటూ నిలదీశారు. ఇంతకీ సిద్ధరామయ్య ఏమన్నారంటే... ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇస్తాం... అన్నీ అమలు చేయాలంటే డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది. ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసింది నిజమే.. అంత మాత్రాన ఫ్రీగా ఇవ్వాలా...? అన్ని వాగ్దానాలు అమలు చేయలేమని కర్నాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో అన్నట్టు ప్రచారం జరుగుతోంది.ఉత్తరాంధ్ర నౌ అనే సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేసిన ఆ వీడియోను కేటీఆర్ రీట్వీట్ చేశా-రు. కాంగ్రెస్ పార్టీకి కొన్ని ప్రశలు సంధించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడానికి డబ్బులు లేవని సిద్ధరామయ్య అంటున్నారని... హామీలు ఇచ్చే ముందు ఫైనాన్షియల్ కండిషన్ గురించి ఆలోచన చేయరా అని నిలదీశారు. కర్నాటకలో మాదిరిగానే తెలంగాణ భవిష్యత్ కూడా ఉంటుందా అని కేటీఆర్ ప్రశ్నించారు. అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మండిపడ్డారు ఎమ్మెల్యే కేటీఆర్. ఏమాత్రం ఆలోచించకుండా మోసపూరిత వాగ్దానాలను ఎలా ఇస్తారని ఆయన క్వశ్చన్ చేశారు. హామీలు ఇచ్చే ముందు ఒక ప్లానింగ్ అంటూ వేసుకోరా అని కూడా నిలదీశారు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా.. ఇష్టారాజ్యంగా హామీలు ఇచ్చి... గెలిచిన తర్వాత ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా అంటూ కాంగ్రెస్ పార్టీపై ఫైరయ్యారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలన్నీ అమలు చేయాలంటే... డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని కర్నాటక సీఎం సాక్షాత్తు అసెంబ్లీలో చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు కేటీఆర్. కేటీఆర్ ట్వీట్‌కు కౌంటర్‌గా మరో ట్వీట్ చేశారు కర్నాటక సీఎం సిద్ధరామయ్య. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎందుకు ఓడిపోయిందో తెలుసా అంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఎందుకంటే... ఏది ఫేక్ వీడియో.. ఏది ఎడిట్ చేసిన వీడియో అన్నది నిర్ధారించడం కూడా బీఆర్ఎస్ పార్టీ తెలియదని అన్నారు. వీడియోను ఎడిట్ చేసి ఎవరో పోస్ట్ చేస్తే... ఆ వీడియోలు నిజమని నమ్మి... మీరు వాటిని ప్రచారం చేస్తారని దుయ్యబట్టారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి పర్‌ఫెక్ట్ బీటీమ్ అని అన్నారు సిద్ధరామయ్య. ఆ వీడియో నిజమైనదా... నకిలీదా అని తెలుసుకోవాలంటే... నిజమైన లింక్ ఓపెన్ చేసి చూడండి అంటూ... తాను మాట్లాడిన వీడియో లింక్‌ను పోస్టు చేశారు కర్నాటక సీఎం సిద్ధరామయ్య.తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చింది. వాటిని పక్కాగా అమలు చేస్తామని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్నీ హామీలు అమలు చేస్తామని తెలిపింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోనే... ఆరు గ్యారెంటీల్లో రెండు హామీలను అమలు చేసింది. తెలంగాణలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. అందుకోసం జీరో టికెట్ విధానాన్ని తీసుకొచ్చింది. గుర్తింపు కార్డు చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు తెలంగాణ మహిళలు. ఇక.. ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా 5లక్షల నుంచి 10లక్షలకు పెంచింది కాంగ్రెస్ ప్రభుత్వం. రెండు హామీలు అమలు చేస-్తున్నా... మిగిలిన వాగ్దానాల పరిస్థితి ఏంటని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి ప్రతిపక్ష పార్టీలు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, వరికి 500 రూపాయల బోనస్ సంగతి ఏంటని ప్రశ్నిస్తున్నారు. సకాలంలో హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్షాల ఆరోపణలకు కౌంటర్ ఇస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని.. అయినా తాము ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని స్పష్టం చేస్తోంది.

# న్యూఇయర్ వేడుకలపై నిఘా

మొదటిపేజీ తరువాయి..



టెస్టులు చేసేందుకు టీఎస్ న్యాబ్ సిద్ధం అవుతోంది. డ్రగ్ డ్రాపర్ మెషీన్‌లు మరికొద్ది రోజుల్లో తెప్పించనున్నారు. న్యూ ఇయర్‌లోపు తెచ్చి అంతటా పరీక్షలు చేసేందుకు ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. లాలాజలం శాంపిల్‌తో క్షణాల్లో డ్రగ్ టెస్ట్ ఫలితాలు వస్తాయి.న్యూఇయర్ వేడుకలు దగ్గరపడుతున్న తరుణంలో ఆంక్షలు విధిస్తూ హైదరాబాద్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. హోటళ్లు, పబ్ లు, ఈవెంట్లకు 31 అర్ధరాత్రి 1గంట వరకే అనుమతి ఉంటుందని హైదరాబాద్ సీపీ కె. శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ గంజాయ్ వాటితే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ముందుగా ఈవెంట్ లు నిర్వహించే హోటళ్లు, పబ్బుల యజమానులు 10 రోజుల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. లిక్కర్ సరఫరాకు కూడా అనుమతి తీసుకోవాలన్నారు. పబ్బులల్లో అశ్లీల నృత్యాలు చేస్తే సహించేది లేదన్నారు. కెపాసిటీకి మించి అనుమతించవద్దని.. పబ్బుల వద్ద సెక్యూరిటీ గార్డులను ఎక్కువగా నియమించుకోవాలని సూచించారు.అంతేకాకుండా తాగి వాహనాలు నడిపితే.. కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే.. 10వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని సీపీ తెలిపారు.




## కుష్టు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :** కుష్టు ఒక వ్యాధి మాత్రమేనని, కుష్టు రోగులను అంటరానివారిగా చూడకూడదని పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి కళానగర్ లోని లెప్రసీ కాలనీకి చెందిన 40 కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు రిలైబుల్ ట్రస్ట్, స్లాప్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి పాల్గొని కుష్టి రోగులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మోతే మణెమ్మ, రిలైబుల్ సంస్థ ట్రస్ట్ రవి, తెలంగాణ స్లాబ్ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.



## డిసిసిబి కొత్త చైర్మన్‌కు శుభాకాంక్షలు

**బిఎన్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిల్లకంటి శేఖర్ రెడ్డి**

**యాచారం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన కొత్త కురుమ సత్తయ్య నూతనంగా డిసిసిబి చైర్మన్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బిఎన్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి కొత్త కురుమ సత్తయ్య ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రభువా..

# నిబంధనలకు సిలువ!

- చర్చీ ముసుగులో అక్రమంగా నిర్మాణం
- ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ షెడ్
- 12 అడుగుల లోతు సెల్లార్ తవ్వకాలు
- ఎన్నికల కోడ్ అదునుగా యధేచ్ఛగా నిర్మాణం
- స్థానిక నేతల అండదండలున్నాయనే ఆరోపణలు
- లక్షల్లో ముడుపులు ముట్టినట్లు ప్రచారం
- ఫిర్యాదులున్నా పట్టించుకోని అధికారులు
- కనీసం కన్నెత్తిచూడని టౌన్ ప్లానింగ్ విభాగం


**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :**
అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ను అదునుగా చూసుకొని పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ షెడ్లను, వ్యాపార సముదాయాలను నిర్మిస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి 6వ వార్డులో భారీ అక్రమ నిర్మాణం చేపట్టారు. చర్చి ముసుగులో 12 అడుగులకు పైగా సెల్లర్ తవ్వకాలు జరిపి మరీ.. రెండు ఫ్లోర్ల భారీ షెడ్ నిర్మిస్తున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఫిర్యాదులు అందుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇచ్చిన ఫిర్యాదులన్నీ బుట్ట దాఖలయ్యాయని, కండ్ల ముందే భారీ నిర్మాణాలు జరుగుతున్న కనీసం కన్నెత్తి చూడడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

**స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు**

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలన్నీ స్థానిక కౌన్సిలర్ల అండదండలతోనే జరుగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల ముడుపులు దండుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు కంటపడితే చాలు దేగళ్ళ వాలిపోయి జేబులు నింపుకుంటారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అందుకు తోడు మున్సిపల్ అధికారులు అక్రమార్కులకు అండగా నిలబడి చేతులు తడుపుకొని అటువైపు చూడడం లేదని, మరి అడిగితే నోటీసులు ఇచ్చామని, ఉన్నతాధికారులకు తెలిపామని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతుందని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని, మున్సిపాలిటీ ఆదాయాన్ని కాపాడాలని కోరుతున్నారు.

### డిటిఎఫ్ అధికారులకు తెలిపాం

చర్చ్ పేరిట అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని సమాచారం ఉంది. ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. సదరు నిర్మాణదారుడుకి నోటీసులు ఇచ్చాము. అయినా యదేచ్ఛగా నిర్మాణాలు జరుపుతున్నారు. డిస్టిక్ టాస్క్ ఫోర్స్ (డిటిఎఫ్) అధికారులకు తెలిపాము. వారి నుంచి ఆదేశాలు వచ్చాక చర్యలు తీసుకుంటాం.



**ఎస్.రవీందర్ రెడ్డి,** మున్సిపల్ కమిషనర్, పెద్ద అంబర్ పేట్



## టెంట్ మినిస్ట్రీస్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్

- పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల క్రిస్టఫర్
- హాజరైన మల్ రెడ్డి అభిషేక్, పలువురు దైవ సేవకులు

**యాచారం, ప్రభాత సూర్యుడు :** యాచారం మండలంలో మంగళవారం యాచారం మండల్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ తరపున సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఇబ్రహీపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తనయుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మస్కు నరసింహ్మా , ఉప్పల భాస్కర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హాజరయ్యారు. వేడుకలలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపిన అనంతరం పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ ముచర్ల క్రిస్టఫర్, వైస్ చైర్మన్ కే సంజీవ మాట్లాడుతూ క్రీస్తు జననం గురించి తెలియపరిచి, క్రిస్మస్ సువార్త అంటే క్రీస్తు జననం, క్రీస్తు మరణం, క్రీస్తు పునరుత్థాంతం గూర్చి మొదటి క్రిస్మస్ దేవదూతలా క్రిస్మస్ దేవుని స్తుతించుట, క్రిస్మస్ దేవుని ప్రకటించుట అనే సందేశం అందించారని అన్నారు. క్రీస్తు జన్మ ఒక అద్భుతం ఆయన పాపులను రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడని ఆ దేవుని కృపలోనే మనం బతుకుతున్నామని ఆ దేవుని దీవెనలు మనఅందరిపై ఉండాలని కోరారు. ప్రపంచంలోనే 80% శాతం కలిగిన క్రైస్తవ జనాభా ప్రపంచంలో క్రైస్తవ దేశాలు ఉన్నత స్థితిలో ఉన్నాయన్నారు. కాబట్టి క్రీస్తును నమ్మిన బిడ్డలు ఎవరు తక్కువ లేరు బాగా వర్ధిల్లారని, దేశాలు వర్ధిల్లాలి క్రీస్తుతో క్రీస్తు పూర్వం క్రీస్తు జననం అనే మాటవచ్చింది. లోకంలోని రెండు రకాలుగా విభజించారు అదే క్రీస్తు శకము క్రీస్తు పూర్వం క్రీస్తు జననం పురస్కరించుకొని యేసయ్య దీవెనవలన అందరము క్షేమంగా ఉండాలని కోరుతున్నామని అన్నారు.

తదనంతరం క్రిస్మస్ గీతాలతో ఆట పాటలతో చిన్నపిల్లలు నృత్యాలతో అలరించారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని కేకు కట్ చేయడం జరిగింది. పాస్టర్ల కుటుంబాల సభ్యులకు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్లు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డిని ,యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మస్కు నరసింహని , ఉప్పల భాస్కర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కే .సంజీవ, పాస్టర్, సెక్రటరీ జి.ఎం. ప్రభాకర్, ట్రెజరీ ఏ. ప్రభాకర్, కమిటీ మెంబర్ భాస్కర్ పాస్టర్, సలహాదారులు రేవ్.ఇజ్రాయిల్ , రేవ్ బి .బాలరాజు పాస్టర్, దైవ వర్తమానము చెప్పిన సేవకుడు రేవ్.డేవిడ్ రాజు, యాచారం మండల్ క్రిస్టియన్ యూత్ లీడర్ జి. బి. జోసెఫ్ , యాచారం మండలం లో 24 చర్చల సంఘ కాపరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆధ్వర్యంలో రేపు సెమీక్రిస్మస్

**ఆర్డిఓ అనంతరెడ్డి**

**ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్యుడు :**
ఈనెల 21న ప్రభుత్వ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మంగళవారం ఆర్డిఓ అనంతరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం క్రిస్టియన్ పాస్టర్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా సెమి క్రిస్మస్ వేడుకలు ఈ సంవత్సరం ఘనంగా ఎర్పాటు చేసుకోవడానికి ఈ నెల 21 న క్రిస్మస్ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విందు కోసం 2 లక్షల రూపాయలు 1000 జతల బట్టలు ప్రభుత్వం అందిస్తుంది. సెమి క్రిస్టమస్ వేడుకలకు ముఖ్య అధితిగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరకానున్నారు. నియోజకవర్గం క్రిస్టియన్ సోదరులు విధిగా పాల్గొని సెమి క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని, నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో చెరుకూరి రాజు ,సుందర్ పాస్టర్స్ జయకుమార్, రవికుమార్,కరుణాకర్, నను నాయక్,శివ,సాధనంద్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వాములపై లాఠీచార్జ్

**స్టేట్‌బ్యూరో, ప్రభాతసూర్యుడు :**
అయ్యప్ప భక్తులపై పోలీసులు లాఠీఛార్జ్ చేసారు. సోమవారం రాత్రి నుండి శబరిమల మార్గం మధ్యలో అయ్యప్ప స్వాములను పోలీసులు నిలిపివేసారు. తాళ్లను కట్టి భక్తులను గంటల తరబడి నిల్చిబట్టడంతో భక్తులు మండిపడ్డారు. చిన్న పిల్లలు ఉన్నారని , ఎంతసేపు నిల్చోవాలంటూ నిలదీసిన అయ్యప్ప భక్తులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసారు. 18 కంపార్టుమెంట్ లలో అయ్యప్ప స్వాములు వేచి వున్నారు. దర్శనానికి సుమారు 10 గంటలకు పైగా సమయం పడుతోంది. అయ్యప్ప సా-



వ్ములకు కనీసం మంచి నీళ్ళు కూడా అందించపోవడంతో ట్రావెన్ కోర్ దేవస్థాన బోర్డుతో ఆరోపణలు వెల్లువెత్తాయి.



# అట్టుడికిన పార్లమెంటు

### ఆగని నిరసనలు

**స్టేట్‌బ్యూరో, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్  లో విపక్షాల నిరసనలతో గందరగోళం నెలకొంది. ఈ నెల 13న లోక్ సభలో ( ఆగంతుకుల చొరబాటుకు సంబంధించి భద్రతా వైఫల్యంపై హోం మంత్రి ప్రకటన చేయాలంటూ విపక్ష ఎంపీలు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. మంగళవారం మరో 49 మంది ఎంపీలపై వేటు పడింది. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారని స్పీకర్ విపక్ష ఎంపీలపై వేటు వేశారు. ఈ మేరకు సభాపతి ఆదేశాలు ధిక్కరించిన సభ్యుల సస్పెన్షన్ కు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మూజువాణీ ఓటుతో లోక్ సభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఎంపీలు సుప్రియా సూలే, ఫరూఖ్ అబ్దుల్లా, శశిథరూర్, మనీశ్ తివారీ, కార్తి చిదంబరం, డింపుల్ యాదవ్, డానిష్ అలీ సస్పెండైన వారిలో ఉన్నారు. ఈ సమావేశాల మొత్తానికి వారిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు.

**ఉభయ సభలు వాయిదా**

విపక్షాల ఆందోళన నేపథ్యంలో మంగళవారం కూడా ఉభయ సభలు స్తంభించాయి. లోక్ సభలో భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని, విపక్ష ఎంపీలపై  సస్పెన్షన్ సైతం ఎత్తేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. స్పీకర్ వెల్ లోకి వెళ్లి మరీ నినాదాలు చేశారు. దీంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. అటు, సస్పెన్షన్ కు గురైన ఎంపీలు అడిగిన 27 ప్రశ్నలను లోక్ సభ ప్రశ్నల జాబితా నుంచి తొలగించారు.

**మొత్తం 141 మందిపై**

కాగా, లోక్ సభలో గత వారం 13 మందిని, సోమవారం మరో 33 మందిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజా సంఖ్యతో కలిపి ఇప్పటి వరకూ లోక్ సభలో 95 మంది ఎంపీలపై వేటు పడింది. అటు, రాజ్యసభలోనూ ఇప్పటివరకూ 46 మంది సస్పెండ్ అయ్యారు. దీంతో ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తం 141 మంది విపక్ష ఎంపీలపై వేటు పడినట్లైంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 22 (శుక్రవారం)తో ముగియనున్నాయి. ఈ నెల 13న గుర్తు తెలియని వ్యక్తి లోక్ సభలో ప్రవేశించి హల్ చల్ చేశాడు. గ్యాలరీలో నుంచి సభలోకి దూసుకొచ్చి టియర్ గ్యాస్ వదిలాడు. దీంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో భయంతో ఎంపీలు పరుగులు పెట్టారు. ఆ రోజు స్పీకర్ వెంటనే సభను వాయిదా వేశారు. జీరో అవర్ లో ఈ ఘటన జరగ్గా అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఇద్దరు ఆగంతుకులను పట్టుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో పార్లమెంట్ లో భద్రతా వైఫల్యంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయితే, ఘటనకు సంబంధించి పోలీసులు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో దాడి తర్వాత ప్రారంభమైన సమావేశాల్లో విపక్ష సభ్యులు పార్లమెంట్ భద్రతా వైఫల్యం ఆందోళన కొనసాగించారు. దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ పట్టుబట్టారు. ఈ క్రమంలో ఎంపీలపై క్రమశిక్షణా చర్యలు చేపడుతూ స్పీకర్, చైర్మన్ నిర్ణయం తీసుకున్నారు.

## ఫ్రస్టేషన్‌లో ప్రతిపక్షాలు

- విపక్షాలపై పీఎం మోదీ విసుర్లు
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్నారని ఎద్దేవా
- సభలో గందరగోళంపై ఘాటు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుండటంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ప్రతిపక్షాలు నిరాశ, నిస్పృహలకు లోనయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. ఆ ఫ్రస్టేషన్‌తోనే ప్రతిపక్ష పార్టీల సభ్యులు పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ఈ తరహా ప్రవర్తన చూస్తుంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వాళ్ల సంఖ్యలు మరింత దిగజారుతాయనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కాగా, పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. పలు కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదముంద్ర వేయించాలని చూస్తున్న కేంద్రానికి ఇది తలనొప్పిగా మారింది. దాంతో ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌లకు కేంద్రం తెరలేపింది. దాంతో ఇప్పటివరకు ఉభయసభల్లో మొత్తం 141 మంది ప్రతిపక్ష ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు.






## ఆటో కార్మికులు బస్‌భవన్ ముట్టడి

**మహాలక్ష్మి పథకం రద్దు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్‌లోని బస్ భవన్‌ను ఆటో కార్మికులు ముట్టడించారు. మహాలక్ష్మి పథకంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఎంఎస్ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడిలో పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల తమకు గిరాకీ పడిపోయిందని కార్మికులు, గతంలో రోజుకు రూ.1000 నుంచి రూ.1500 సంపాదించేవారమని, ఇప్పుడది రూ.400లకు పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే తమను ఆదుకోవాలని, కనీసం కిస్తీలు కూడా కట్టలేకపోతున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల ఆదాయానికి రోజు రూ.1000 వరకు గండి పడిందని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఇప్పటికే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, వారికి ఇబ్బంది కలుగకుండాచర్యలు తీసుకోవాలని కోరారు.

## లోన్‌యాప్స్‌పై కేంద్రం చర్యలు

- ఇప్పటికే 2,500 యాప్స్ తొలగింపు
- పార్లమెంట్‌లో మంత్రి నిర్మలమ్మ వెల్లడి



**న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు**

లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకునేవారు తిరిగి ఆ రుణాలు చెల్లించలేక ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు ఈ మధ్య కాలంలో చాలా వెలుగుచూశాయి. దాంతో ఇలాంటి వాటిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. లోన్ యాప్స్ మీద కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ఓ ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో నిర్మలా సీతారామన్ లోన్ యాప్స్ గురించి పేర్కొన్నారు. ప్రజలకు ప్రాణ సంకటంగా మారిన లోన్ యాప్స్‌ను గూగుల్ సంస్థ తొలగిస్తున్నదని తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 జూలై మధ్య కాలంలో ఏకంగా 2,500 మోసపూరిత లోన్ యాప్‌లను గూగుల్ తొలగించిందని వెల్లడించారు. ప్రజలను మోసం చేస్తున్న యాప్‌ల మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని తన సమాధానంలో నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వర్షానికి మొలిచిన పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫ్రాడ్ లోన్ యాప్‌ల మీద కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. అందుకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్రాడ్ లోన్ యాప్స్ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జనం వాటిపై అవగాహన పెంచుకుంటే మోసాల బారినపడకుండా ఉండవచ్చని సూచించారు. మోసపూరిత రుణ యాప్‌లను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలలో భాగంగా, చట్టపరమైన నియమాలను పాటిస్తున్న యాప్‌ల జాబితాను ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గూగుల్‌తో పంచుకుందని తెలిపారు.



## ఫస్ట్ తెలంగాణ..

- విత్తన సరఫరాలో మనకే తొలి ప్రాధాన్యం
- వ్యవసాయ శాఖ సమీక్షలో మంత్రి తుమ్మల నిర్ణయం
- అధికారులకు, విత్తన కంపెనీలకు ఆదేశం

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :** రైతులకు విత్తన సరఫరా, తెలంగాణ విత్తన రంగ అభివృద్ధి పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమీక్షా సమావేశం నిర్వహించారు.  ఈ సమావేశానికి, వ్యవసాయ శాఖ, విత్తనధ్రువీకరణ సంస్థ, విత్తనాభివృద్ధి సంస్థ, వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా, వచ్చే సీజన్ లో రోజుల్లో రైతులకు విత్తన సరఫరా, నాణ్యమైన విత్తన లభ్యత (ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న) పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రైతులకు విత్తన లభ్యతలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని అధికారులను మరియు  విత్తన కంపెనీలను ఆదేశించారు. విత్తన సరఫరాలో తెలంగాణ రైతులకు అధికప్రాధాన్యత ఇచ్చి, మిగతా విత్తనాలను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసుకోవాలని కంపెనీలకు సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలో నకిలీ విత్తనాల సరఫరా లేకుండా చూడాలని, అలాంటి వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల వలన రైతులకు ఏదైనా నష్టం జరిగితే విత్తన కంపెనీలు తగిన నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలీ సూచించారు.

## ఆన్లైన్ గేమ్‌లో మరో ప్రాణం

- డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య
- సోషల్‌మీడిలో బాధితుడి సెల్ఫీ వీడియో

**యాదాద్రి భువనగిరి, ప్రభాతసూర్యుడు :** భువనగిరి మండలం, బండ సోమవారం గ్రామానికి చెందిన “చెరుకూరి ప్రసాద్”.. ఆన్లైన్ గేమ్ లకు బానిస అయ్యాడు. తాతలనాటి ఆస్తి ఎకరం పొలం అమ్మగా డబ్బులు రాగా.. ఆ డబ్బులతో వ్యాపారం చేసుకుని భూమి కొనుక్కోవాలి అనుకున్న అతనికి.. ఆన్లైన్ గేమ్ వ్యసనంగా మారింది. దీంతో.. డబ్బులు అన్ని ఆన్ లైన్ గేమ్ లో పోగొట్టుకున్నాడు. చివరకు తన చావుకు కారణం తండ్రి అని.. సెల్ఫీ వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పెట్టారు. విషయం తెలుసుకున్న తండ్రి భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

## పేదలకు పండుగే..

- రేషన్‌కార్డుల జారీకి సర్కారు గ్రీన్‌సిగ్నల్
- ఈ నెల 28 నుంచి దరఖాస్తులకు మోక్షం
- సీఎం రేవంత్ సరికొత్త నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :** సంక్రాంతి పండుగకు ముందే నిరుపేదల ఇంట్లో సంబరాలు చోటుచేసుకోనున్నాయి. ఇంతకాలం రేషన్‌కార్డు లేక బాధపడుతున్న కుటుంబాలకు కాంగ్రెస్ సర్కారు తీపికబురు చెప్పింది. దీంతో నిరుపేదల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. కొత్త రేషన్ కార్డుల జారీకి సీఎం రేవంత్ సర్కారు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.  కొత్త రేషన్ కార్డుల కోసం ఈ నెల 28 నుంచి అర్హులు అప్లై చేసుకోవచ్చని సూచించింది. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పులను సరిచేయడానికి కూడా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొంది. అలాగే  ఈ నెల 28 నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించనున్నారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్ గ్రామ సభలో నిర్ణయం మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈవిషయాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR,  Printed at Akshaya Printers, H/No: 7-83/2,  HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY,  TELANAGANA, EDITOR CHERUKU UPENDAR,  PUBLICATION at  HAMSA PUBLICATIONS, H/No: 7-83/2,  HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY,  TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215